క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి నుంచి మార్చాలకు వెళ్లే ఫీడర్‌లో కొంత భాగం మార్చాల వ్యవసాయానికి సంబంధించి కనెక్షన్లు, ఎంగంపల్లి ప్రాంతంలోని కొన్ని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఘనంగా సుంకిరెడ్డి జన్మదిన వేడుకలు



కల్వకుర్తిరూరల్: ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు వెంకటాపూర్‌లో ఆపార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు అనీల్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనీల్‌గౌడ్ కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇస్తారి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సంతోష్, ఐలెల్, సతీష్, శేఖర్, శంకర్, కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలో బాల కార్మికులు



కోడేరు: మండల కేంద్రమైన కోడేరుతో పాటు మైలారం, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కుటుంబాల పిల్లలతో యజమానులు పనులు చేయించుకుంటున్నారు. నిబంధనలు విరుద్ధంగా చిన్నారులతో పనులు చేయించుకుంటున్న ఇటుక బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తనిఖీ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు సింగిల్ విండో మహాజన సభ

పాన్‌గల్: స్థానిక సింగిల్ విండో మహాజన సభ విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 29 మార్చి 2023 నుంచి 28 మార్చి 2024 వరకు జమ ఖర్చులు ఆమోదించుట, 2024–2025 సంవత్సరానికి అంచనా బడ్జెట్, ప్రణాళిక, ఇతర అంశాలు ఆమోదించుట గురించి సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశానికి సంఘం సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఈఓ కోరారు.

గడ్డివాము దగ్ధం



వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండా పంచాయతీకి చెందిన రాత్లావత్ ప్రకాష్ అనే రైతుకు చెందిన గడ్డివాము, వేరుశనగ పొట్టు సోమవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. జీవనోపాధి కోసం 30 గొర్రెపిల్లలు, నాలుగు పశువులను తెచ్చుకొని పెంచుకుంటున్న సమయంలో గడ్డివాము పూర్తిగా కాలిపోవడం వల్ల మూగ జీవాలకు మేత లేకుండా పోయిందని, ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలని రైతు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి దొబ్బలయ్య పాములు పట్టే వృత్తిలో కొనసాగుతూ తాను ఇటీవలే పాముకాటుకు గురై మరణించాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం గ్రామంలోని పలువురు పెద్దలు పరామర్శించి రూ.22 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామ పెద్దలు ముంత మల్లయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, సాయిబాబ, కావలి మహేష్, రాజు, బాలపీరు, వెంకటయ్య తదితరులు కోరారు.



కల్వకుర్తి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..



అచ్చంపేట అంబగుడి వద్ద కామదహనం



పాలెంలో ..



కోడేరులో..

సంబురంగా హోలీ



అచ్చంపేటలో పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువకులు

కల్వకుర్తిరూరల్: జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు సోమవారం అంబరాన్నంటాయి. పట్టణంలో చిన్నపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ఆర్యవైశ్య సంఘం వాసవీక్లబ్ ఆవోపా సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అచ్చంపేట: నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో యువకులు, చిన్నారులు వీధుల్లో తిరుగుతూ రంగులు చల్లుకొని సందడి చేశారు. ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు, తిమ్మాజిపేటలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించుకున్నారు.

కోడేరు: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో



పెంట్లవెల్లిలో..

యువతీ, యువకులు రంగులు చల్లుకొని నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కాముడి దాహనం నిర్వహించారు. హోలీ సంబురాల్లో నాయకులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు జూపల్లి, గోకారం, శిర్సనగండ్ల, తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో యువకులు, మహిళలు చిన్న పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.



ఈగలపెంటలో..



తాడూరులో

ఉప్పునుంతల: యువతీ, యువకులు ఉదయాన్నే రోడ్లపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రెండుమూడు రోజులుగా పోగుచేసిన జోడెర డబ్బులతో సామూహికంగా విందులు చేసుకున్నారు.

అచ్చంపేట రూరల్: బంధువులు, మిత్రుల ఇంటికి వెళ్లి రంగుల చల్లి సంబురాలు చేసుకున్నారు. వీధుల్లో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు, అటవీ లోతట్టు ప్రాంత చెంచు పెంటల్లోని ప్రజలు హోలీ పండగను ఆనందోత్సవాలతో నిర్వహించుకున్నారు.

దోమలపెంట: ఈగలపెంటలోని జెన్‌కో కాలనీలో గిరిజన విద్యుత్ ఉద్యోగులు భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణరావు, ఎస్ఈ ఆదినారాయణ నివాసాల వద్దకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ఉద్యోగుల సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు నానుచౌహాన్, రెడ్యానాయక్, పాండు, బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈగలపెంటలో చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

తెలకపల్లి: చిన్నారులు, మహిళలు, యువకులు హోలీ సంబురాల్లో పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో చిన్నారులు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, పెంట్లవెల్లి, జటప్రోల్ గ్రామాల్లో పండుగ సంబరాలు అంబరాన్నంటాయి.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోలీ సంబురాలు మిన్నంటాయి.

లింగాల: డీజే పాటలకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేస్తూ, కేరింతలు కొట్టారు.



వెల్దండలో..

రంగ్‌బర్‌సే..

అమ్రాబాద్: మండల కేంద్రమైన అమ్రాబాద్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో హోలీ పండుగను ప్రజలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. వివిధ వసతి గృహాల విద్యార్థులు, కొంత మంది యువకులు డప్పు వాయిద్యాలతో నృత్యాలు, కేరింతలు కొడుతూ వీధుల గుండా తిరిగారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. పదరతో పాటు మండలంలోని వంకేశ్వరం, చిట్లంకుంట, ఉడిమిళ్ల తదితర గ్రామాల్లో హోలీ సంబరాలను ఉత్సాహంగా కొనసాగాయి.



మాధవానిపల్లిలో ..



ఉప్పునుంతల మండలం వెల్టూర్‌లో..



జెన్‌కో కాలనీలో సీఈకి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీ ఉద్యోగులు



మన్ననూరులో హోలీ ఆడుతున్న చిన్నారులు, యువకులు



పెద్దకొత్తపల్లిలో..



జూపల్లిలో హోలీ సంబురాలు..



లింగాలలో..



తెలకపల్లిలో..

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



నాగర్‌కర్నూల్ రామాలయంలో వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వరదరాజన్ అయ్యంగార్ వ్రత విశిష్టతను వివరించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..

తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో అభిషేకం, సహస్రనామ హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సత్యమ్మ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



శిర్సవాడలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పెద్దదేవి ఉత్సవాలు

అమ్రాబాద్: పదర మండలంలోని చిట్లంకుంటలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మదేవి ఉత్సవాలు నిర్వహించారు. యాదవులు నైవేద్యాలతో ఊరేగింపుగా పెద్దమ్మదేవి ఆలయానికి వచ్చారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కుమారుడు యశ్వంత్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నేతల వెంకటయ్య, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.



పెద్దమ్మదేవికి పూజలు చేస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



మైలారంలో ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

కోడేరు: మండలంలోని మాచుపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. కంచెలేకపోవడంతో మూగజీవాలు విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ ఇంటిపై రాళ్లురువ్వి, మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సారంగి భాగ్యమ్మ నివాసంపై అదే గ్రామానికి చెందిన కేశవులు, నరేష్‌లు రాళ్లురువ్వారు. ఇంటి యజమానురాలు భాగ్యమ్మ గమనించి ఎందుకు రాళ్లు విసురుతున్నారని ప్రశ్నించగా ఆమెతో దర్పషలాడి అసభ్యంగా ప్రవర్తించారు. బాధితురాలు 100 డయల్ చేసి సమాచారం ఇచ్చింది. పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకుంటుండగా పోలీసు సిబ్బందికి విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేశవులు, నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జనారణ్యంవైపు జాతీయపక్షులు



అడవుల్లో ఉండాల్సిన జాతీయ పక్షులు జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. ఎండాకాలంలో ఆహారం, నీరు దొరకక నివాస ప్రాంతాలవైపు అడుగులు వేస్తున్నాయి. చెట్లు ఎండిపోవడం, నీరు లభించకపోవడంతో తప్పనిపరిస్థితుల్లో గ్రామాల బాట పడుతున్నాయి. మండలంలోని అటవీ సమీప గ్రామాలైన అంబగిరి, లక్ష్మీపల్లి, మైలారం, చెంచుగూడెం, బిల్లకల్ ప్రాంతాల్లో నెమళ్లు తరుచుగా పెంపుడు కోళ్ల మాదిరి ఇళ్ల ఎదుట గింజలు తింటాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. మైలారం గ్రామం సమీపంలోని గుట్ట ప్రాంతం నుంచి నిత్యం మయూరాలు వస్తుంటాయని స్థానికులు పేర్కొన్నారు.

– బల్మూర్

పనులు పూర్తయ్యేనా?



ఇంద్రకల్‌లో అసంపూర్తిగా భవన నిర్మాణం

- నత్తనడకన పాఠశాల భవన నిర్మాణాలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంలో భాగంగా ఆగమేఘాలపై ఉన్న పాఠశాలలను కూలివేసి కొత్తగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఎంతో ఉత్సాహంతో చేపట్టిన నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ, మన ఊరు మన బడి పథకంలో భాగంగా 12 పాఠశాలలకు దాదాపు రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రెండేండ్ల కిందట నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థలం కొరత కారణంగా పలు చోట్ల శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏళ్లు గడిచిన నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 12 పాఠశాలల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అందులో నాలుగు పాఠశాలల పనులు పూర్తి అయ్యాయి. మండల కేంద్రంతోపాటు బలాన్‌పల్లి, చర్లతిరుమలాపురం, గుంతకోడూరు, మేడిపూర్, యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, తుమ్మలసూర్, చర్లతిరుమలాపురం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన భవనాలు, అదనపు గదుల నిర్మాణాల పనులు చేపట్టారు. రెండేళ్లు పూర్తి కావొస్తున్నా పనులు నత్తనడకనసాగుతున్నాయి. ప్రస్తుతం మేడిపూర్, చర్లతిరుమలాపురం, గుంతకోడూరు, బలాన్‌పల్లి గ్రామాల్లో మాత్రమే దాదాపుగా పనులు పూర్తి అయ్యాయి. ఇప్పటివరకు రూ.1.50 కోట్ల వరకు నిధులు వెచ్చించారు. కొన్నిచోట్ల ప్రారంభ దశలో, మరికొన్ని చోట్ల చివరిదశలో అసంపూర్తిగా భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీరాజ్ ఏఈ ఉపేందర్‌రెడ్డి వివరణ అడగగా సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిర్మాణాలను పరిశీలిస్తాం..



మన ఊరు మన బడి పథకంలో భాగంగా పాఠశాలల భవన నిర్మాణాలు చేపట్టాం. అసంపూర్తిగా ఉన్న పాఠశాలలను పరిశీలిస్తాం. వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ, తాడూరు



తాడూరు పాఠశాలలో నిలిచిన పనులు